క్లుప్తంగా

ముందస్తు అరెస్టులు సరికాదు



పోలీసుల అదుపులో రాంబల్‌నాయక్

కేశంపేట: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నియోజకవర్గానికి వస్తున్న సందర్భంగా శనివారం పోలీసులు లంబాడి హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్‌ను పోలీసులు హౌజ్ అరెస్టు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అనుచరుడైన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సుప్రీం కోర్టులో కేసు వేశారన్నారు. మంత్రి పర్యటన సందర్భంగా ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామికమన్నారు. రాష్ట్ర మంత్రికి వినతిపత్రం అందించే అవకాశం లేకుండా.. అరెస్టులు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అరెస్టు చేసిన నాయకులు, కార్యకర్తలను భేషరుతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్టీ జాబితా నుంచి తొలగిస్తే ఆందోళన తప్పదు

కొందుర్గు: ప్రభుత్వం లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే కుట్ర చేస్తోందని.. ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లేడ్ చౌదరిగూడ మండల అధ్యక్షుడు రామ్‌చరణ అన్నారు. లంబాడీలు చేపట్టే నిరసన కార్యక్రమాన్ని అడ్డుకోవడంలో భాగంగా శనివారం పోలీసులు పలువురు లంబాడి నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్ మాట్లాడుతూ.. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కాంగ్రెస్ నాయకులు సోయం బాబురావు, తెల్లం వెంకట్రావు కోర్టులో పీటీషన్ వేయడం బాధాకరమన్నారు. మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాసురెడ్డి ప్రోత్సాహంతోనే వారు కోర్టులో పీటీషన్ వేశారని వాపోయారు. అరెస్టయిన వారిలో నాయకులు వినోద్, రవినాయక్, రమేశ్‌నాయక్ ఉన్నారు.

గోదారంగనాయకస్వామి దేవాలయంలో పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామ పరిధిలోని శ్రీ గోదారంగనాయకస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంత పద్మనాభ స్వామి చతుర్థిని పురస్కరించుకొని ఆలయ ధర్మకర్తలు ఎస్టీఎస్ పురుషోత్తమాచార్యులు, ఎస్టీఎస్ కేశవాచార్యులు, ఎస్టీఎస్ రాజగోపాలచార్యులు, రాంమందిర్ ఆలయ అర్చకుడు నంభూద్రి శేషాద్రిచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు ఆలయంలో కోటి వత్తులను వెలిగించి స్వామివారికి పూజలు చేశారు. చతుర్థి రోజున వత్తులను వెలిగిస్తే ఎంతో పుణ్యఫలం లభిస్తుందని భక్తుల ప్రగాఢ నమ్మకం. ఈ పూజా కార్యక్రమాల్లో పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గజేందర్‌గౌడ్



బలరామ జయంతిలో పాల్గొన్న బీకేఎస్ నాయకులు, రైతులు

కొందుర్గు: పార్టీలకతీతంగా రైతులందరూ ఏకమైతేనే సమస్యలు పరిష్కారమవుతాయని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడిగే గజేందర్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని ముట్పూర్ రైతువేదిక వద్ద బలరామ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. ప్రస్తుతం రైతులు యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారని, ప్రభుత్వం పంటలకు సరిపడా యూరియా సరఫరా చేయకపోవడం బాధాకరమన్నారు. అదేవిధంగా గ్రామాల్లో కరెంటు సమస్యలు తీవ్రంగా వేధిస్తున్నాయన్నారు. రైతులందరూ ఏకమై సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీకేఎస్ మండల అధ్యక్షుడు చంద్రమౌళి, కార్యదర్శి రామస్వామి, రైతులు మల్లేశ్, పెంటయ్య, రమేశ్, సందీప్, విష్ణువర్ధన్‌రెడ్డి, ద్విజేందర్, యాదయ్య, కాంతంరెడ్డి పాల్గొన్నారు.



చేవెళ్ల: ఖానాపూర్‌లో రూ.9.5 లక్షలకు లడ్డూ సొంతం చేసుకున్న చేకూరి అంజిరెడ్డి



చేవెళ్ల: జర్నలిస్ట్ కాలనీలో రూ.6.66లక్షలకు లడ్డూ దక్కించుకున్న కాసుల ఆనంద్‌గౌడ్, కిష్టమోళ్ల త్రినేత్ర



మొయినాబాద్: ఎనికేపల్లిలో వినాయక శోభాయాత్రలో గ్రామస్తులు

గంగమ్మ ఒడికి.. గణనాథుడు

గణేశ్ నిమజ్జనోత్సవం శనివారం చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో కనుల పండువగా జరిగింది. నవరాత్రులు పూజలందుకున్న గణనాథుల నిమజ్జనానికి నిర్వాహకులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆయా మండపాల వద్ద నిర్వహించిన లడ్డూ వేలం పాటలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బ్యాండు మేళాలు, సంప్రదాయ నృత్యాల మధ్య ఉండ్రాలయ్యను గంగమ్మ ఒడికి సాగ నంపారు. గణపతి బప్పా మోరియా .. ఆదా లడ్డూ చోరియా అంటూ భక్తులు హోరెత్తిన నినాదాలతో గణపయ్యకు ఘనమైన వీడ్కోలు పలికారు.



చేవెళ్ల: రచ్చబండ వినాయకుడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు



చేవెళ్లలో వినాయకుడి నిమజ్జన శోభాయాత్ర



షాబాద్: దామర్లపల్లిలో రూ.1 లక్ష 5 వేలకు లడ్డూ దక్కించుకున్న కర్రె బాల్‌రాజు



చేవెళ్ల: గుండాలలో రూ.4లక్షలకు లడ్డూ దక్కించుకున్న తిప్పని అమర్‌నాథ్‌రెడ్డి



షాబాద్: హైతాబాద్‌లో రూ.2.26 లక్షలకు లడ్డూ దక్కించుకున్న శ్రీరామ్ రాఘవేందర్‌గుప్తా



చేవెళ్ల: హనుమాన్ ఆలయం వద్ద వినాయకుడి పూజల్లో పాల్గొన్న భక్తులు



షాబాద్: మద్దూరులో..



మొయినాబాద్: మొయినాబాద్‌లో శోభాయాత్ర



మొయినాబాద్: శోభాయాత్రలో నృత్యాలు



మొయినాబాద్: రూ.6.50 లక్షలకు లడ్డూ దక్కించుకున్న ప్రభాకర్‌యాదవ్

సన్మానం



వెంకట్‌రాంరెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నాయకులు

షాద్‌నగర్‌రూరల్: ఉద్యమకారుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట్‌రాంరెడ్డి ఉద్యమకారుల వెల్పేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి ఆయనకు పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంలో వెంకట్‌రాంరెడ్డి నియోజకవర్గంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన పోరాటాన్ని గుర్తించి ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలను అప్పగించడం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో ఆయన మరిన్ని పదవులను చేపట్టాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్అలీఖాన్‌బాబర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముంత ఆంజనేయులు సేవలు మరువలేనివి



ఆంజనేయులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా ముంత ఆంజనేయులు చేసిన సేవలు మరువలేనివని ఆ సంఘం జిల్లా కార్యదర్శులు శివారెడ్డి, నర్సింలు అన్నారు. పట్టణంలోని ఎమ్మార్సీ ఆవరణలో శనివారం ముంత ఆంజేయులు 6వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో బాలయ్య, సత్యం, లక్ష్మీదేవమ్మ, అరుణ, జ్యోతిర్మయి, శివరాములు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ యూనియన్ కమిటీ ఎన్నిక

చేవెళ్ల: అంగన్‌వాడీ యూనియన్ చేవెళ్ల ప్రాజెక్టు పరిధిలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు తెలిపారు. చేవెళ్లలో శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ.. అంగన్‌వాడీల సమస్యలపై సీఐటీయూ పోరాడుతోందని.. కార్మికులకు అండగా నిలబడుతుందన్నారు. ఈ సందర్భంగా చేవెళ్ల ప్రాజెక్టు పరిధిలోని నూతన కమిటీని ఎన్నుకున్నారు. చేవెళ్ల ప్రాజెక్టు అధ్యక్షురాలిగా టి.లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా పి.స్వప్న, కోశాధికారిగా ఎం.ఉమారాణి, ఉపాధ్యక్షులుగా రాధ, ప్రవీణ, పద్మారాణి, ప్రేమలత, సహాయ కార్యదర్శులుగా కవిత, సరస్వతి, భూదేవి, 20 మందిని ప్రాజెక్టు కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.



ఎన్నికైన సభ్యులతో సీఐటీయూ నాయకులు

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం



ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

షాబాద్: కేంద్ర ప్రభుత్వం పలు నిత్యావసర వస్తువులపై జీఎస్టీని తగ్గించడాన్ని హర్షిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మద్దూరు మాణెయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని పేదలకు మేలు చేసేలా జీఎస్టీ పన్నుల భారాన్ని తగ్గించిన కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. దేశ చరిత్రలో గతంలో ఎన్నడూ లేనంతగా అనేక నిత్యావసర వస్తువులపై జీఎస్టీని 5 శాతం తగ్గించారని, కొన్నింటికి పూర్తిగా మినహాయించారన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర స్వచ్ఛ భారత్ సెల్ కన్వీనర్ రాము, జిల్లా అధికార ప్రతిధిని కూతురు మహేందర్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి దాదె హరీశ్, నాయకులు తదితరులు ఉన్నారు.

అంజయ్య అవినీతిని నిరూపిస్తే..

వైఎస్సార్ విగ్రహం సాక్షిగా ముక్కు నేలకు రాస్తాం

- జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గణేశ్

షాద్‌నగర్‌రూరల్: మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే పట్టణ ముఖ్య కూడలిలోని వైఎస్సార్ విగ్రహం వద్ద ముక్కు నేలకు రాస్తామని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేశ్ అన్నారు. శనివారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏ సమావేశమైనా, ఏ వేదిక అయినా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అంజయ్యయాదవ్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకొని మాట్లాడటం సరికాదన్నారు. వ్యక్తిగత ఆరోపణలను మానుకొని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. ప్రెస్‌మీట్‌లో అంజయ్యయాదవ్ చేసిన అంశాలను ప్రస్తావించకుండా కాంగ్రెస్ నాయకులు అర్థంలేని ఆరోపణలు చేయడం సమంజసం కాదని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే మంజూరు చేసిన పనులకే కాంగ్రెస్ నాయకులు కొబ్బరికాయలు కొట్టి ప్రారంభిస్తున్నారని ఎద్దేవా చేశారు. పదేళ్లపాటు ఆదర్శంగా పరిపాలన చేసిన అంజయ్యయాదవ్ అవినీతికి పాల్పడ్డారనే తప్పుడు ఆరోపణలు చేయడం సిగ్గు చేటన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వ భూమిని అక్రమంగా తీసుకున్నారనే ఆధారాలు ఉంటే నిరూపించాలని సవాల్ విసిరారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఎంఎస్.నటరాజ్, లక్ష్మణ్‌నాయక్, బచ్చలి నర్సింహ, రవియాదవ్, రమేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

మునీలయ్య సేవలు చిరస్మరణీయం

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి

నందిగామ: నర్సప్పగూడ మాజీ సర్పంచ్ గోవిందు మునీలయ్య గ్రామానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని నర్సప్పగూడలో శనివారం గ్రామ మాజీ సర్పంచ్ గోవిందు అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో మునీలయ్య 11వ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ హాజరై ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, మాజీ సర్పంచ్‌లు ఎమ్మె సత్యనారాయణ, కడేంపల్లి శ్రీనివాస్‌గౌడ్, జెట్ట కుమార్, వెంకట్‌రెడ్డి, యాదమ్మ, గోవిందు, చేగూరు పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మాజీ చైర్మన్ విఠల్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ యాదయ్యగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మీభూపాల్, నాయకులు గోవిందు యాదయ్య, గోవిందు గోపాల్, గోవిందు శేఖర్, లక్ష్మణ్‌గౌడ్, బంటారం కృష్ణగౌడ్, సుదర్శన్‌గౌడ్, కొండన్నగూడ సత్యం, కాట్న శ్రీశైలం, జంగిలి కుమార్, నీరటి సురేందర్, గోవిందు శ్రావణ్‌కుమార్, జంగిలి మల్లయ్య, శంకరయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, నాయకులు

ముసాయిదా ఓటరు జాబితా విడుదల

కేశంపేట: స్థానిక ఎన్నికల నేపథ్యంలో శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ముసాయిదా ఓటర్ల లిస్ట్, పోలింగ్ బూత్‌ల జాబితాను అధికారులు ప్రదర్శించారు. మండల పరిధిలో 12 ఎంపీటీసీ స్థానాలకు గాను 29 గ్రామ పంచాయతీల్లో 61 పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు వారు తెలిపారు. ముసాయిదా జాబితాకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 8వ తేదీలోపు తెలియజేయాలని కోరారు. మండలంలో 18,316 మంది పురుషులు, 18,631 మహిళలు, మొత్తం 36,947ల మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు.



కేశంపేట: ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న అధికారులు

8న వివిధ పార్టీల నాయకులతో సమావేశం

కొత్తూరు: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓటరు ముసాయిదా(డ్రాఫ్ట్) జాబితాను శనివారం అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ప్రదర్శించారు. ఈ జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 8వ తేదీలోగా తెలియజేయాలని ఎంపీడీఓ అరుంధతి తెలిపారు. అదేరోజు అన్ని రాజకీయ పార్టీల నేతలతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అభ్యంతరాల స్వీకరణ, పరిశీలన అనంతరం తుది జాబితాను ప్రకటించనున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

8 వరకు అభ్యంతరాలు తెలపాలి

షాబాద్: స్థానిక ఎన్నికలకు ముసాయిదా ఓటరు లిస్ట్, పోలింగ్ స్టేషన్ల జాబితాను సిద్ధం చేసినట్లు ఎంపీడీఓ అపర్ణ పేర్కొన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో 41 గ్రామ పంచాయతీలకు సంబంధించిన ముసాయిదా ఓటరు జాబితాను అధికారులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 8వ తేదీవరకు జాబితాలో అభ్యంతరాలు తెలపాలని, 10వ తేదీన తుది జాబితా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు ఉన్నారు.

రెండు మండలాల్లో..

కొందుర్గు: మండల పరిషత్ కార్యాలయాలు, అన్ని గ్రామ పంచాయతీల్లో శనివారం ముసాయిదా ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్ల లిస్ట్‌ను అధికారులు ప్రదర్శించారు. కొందుర్గు మండలానికి సంబంధించి 8 ఎంపీటీసీ స్థానాలకు గాను 23,659 మంది ఓటర్లు ఉన్నారని, మొత్తం 43 పోలింగ్ కేంద్రాలు గుర్తించినట్లు ఎంపీడీఓ లక్ష్మీఅనురాధ తెలిపారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో 9 ఎంపీటీసీ స్థానాలకు గాను 25,869 మంది ఓటర్లు ఉన్నారని, మొత్తం 45 పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓలు విజయ్‌కుమార్‌పాల్, హన్మంతురెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడలో ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న అధికారులు



షాబాద్‌లో ఓటరు జాబితా జాబితా ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ అపర్ణ, సిబ్బంది



కొత్తూరు: డ్రాఫ్ట్ ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ అరుంధతి